క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హాలిగేర గ్రామ సమీపం లోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గీతావాణి శనివారం తెలిపారు. సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయ, విద్య, విద్యుత్, వైద్యం, ఉపాధి హామీ పథకం, మంచి నీటి సమస్య, వెలుగు, ఐసీడీఎస్ శాఖల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

డ్రైనేజీ ఏర్పాటుకు స్థల పరిశీలన

మద్దికెర : స్థానిక ప్రధాన బజారులో పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కాలువ వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయనున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, ఈఓ రవి తెలిపారు. శనివారం డ్రైనేజీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, మార్కింగ్ వేయించారు. బజారులో మార్కెట్ సముదాయం నిర్మిస్తున్నందువల్ల డ్రైనేజీ అవసరమవుతుందని, మురుగునీటిని మరలించేందుకు కాలువ నిర్మిస్తామని చెప్పారు. పనులు సకాలంలో పూర్తయ్యేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.ఆంజనేయులు, రామాంజులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వెల్దుర్తి మెయిన్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

కృష్ణగిరి: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువుతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-1 ఇందిర ఆదేశించారు. వెల్దుర్తిలోని మెయిన్ స్కూల్‌ను శనివారం ఆమె తనిఖీ చేసి పలు రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎఫ్ఏ-1 పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులపై ఆరా తీశారు. విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆలూరు: స్థానిక కోయనగర్, మర్రితాత మఠం, ఉపాధ్యాయనగర్, ఎన్జీవోస్ కాలనీల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ ఏఈ గుర్రప్ప శనివారం తెలిపారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు తీగల ఏర్పాటు, లైన్‌లో మరమ్మతు పనులు కారణంగా విద్యుత్ స రఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదు

హొళగుంద: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాలనరసింహులు హెచ్చరించారు. శనివారం మార్లమడకి రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండ బాణసంచా కలిగి ఉండడం, విక్రయించడం నేరమన్నారు. వివిధ వాహనాల రికార్డులను పరిశీలించి నిబంధనలు అతిక్రమించిన, రికార్డులు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

జగన్నాథం మృతి తీరనిలోటు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జగన్నాథం అనారోగ్యంతో మృతి చెందాడని, ఆయన మృతి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. శనివారం గ్రామానికి చేరుకుని జగన్నాథం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘకా లం పాటు పార్టీకి సేవలందించిన జగన్నాథం మరణం తీరనిలోటన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

వెల్దుర్తి(కృష్ణగిరి): సమాచారహక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం సేవా కేంద్రాల సిబ్బందికి సమాచార హకు చట్టం-2005పై అవగాహన కల్పించారు. చట్టం యొక్క విధివిధానాలు, కాల పరిమితి గురించి వివరించారు. తమ పరిధిలో జరిగే కార్యక్రమాల వివరాలు అడిగే అధికారం ప్రతి పౌరుడికి ఉందన్నారు. అడిగిన సమాచారాన్ని గడువులోపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు మంగళం

- జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యశిబిరాలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- ప్రస్తుతం కనిపించని ఉచిత వైద్య శిబిరాలు

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులు పాల్గొని 14 రకాల జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేసేశారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రెఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యసేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.



రాతనలో చిన్నారిని పరీక్షిస్తున్న స్పెషలిస్టు వైద్యుడు (ఫైల్)



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (ఫైల్)

తుగ్గలి : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేస్తోంది. ఆధునిక వైద్య సేవలకు పల్లెవాసులు క్రమేణా దూరమవుతున్నారు. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేసింది. ఇందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యుల ద్వారా వైద్య సేవలు అందించడమే కాకుండా మందులను సైతం ఉచితంగా అందించింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫార్సులను పంపేవారు. చిన్నపిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి నిపుణులైన కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనూ పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతి వైద్య శిబిరానికి సుమారు ఐదారుకు పైగా స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించారు.14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు గుండె సంబంధిత ఈసీజీ కూడా శిబిరంలోనే తీసేవారు. అత్యవసర వైద్యం, చికిత్స అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్య శ్రీ అమలులో ఉన్న ఆసుపత్రికి రెఫర్ చేసి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. దీంతో దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చింది.

పట్టించుకోని ప్రభుత్వం..

సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రజల వైద్యాన్ని గాలికొదిలేసింది. గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ మచ్చుకైనా కనిపించడం లేదు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చేస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ముదుకెళుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మేలుచేసే ఇలాంటి కార్యక్రమాలను మళ్లీ నిర్వహించాలని ప్రజలు కోరుకుతున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు..

కురుస్తున్న వర్షాలకు, నీటి కలుషితం ద్వారా విషజ్వరాలు, అతిసార వ్యాధులు విజృంభిస్తున్నాయి.పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటంతో దోమలు బెడద తీవ్రంగా మారింది. ఇక డెంగీ, మలేరియా, చికెన్ గున్యాతో పాటు కొత్తగా విష జ్వరాలు వ్యాపిస్తుండటంతో జనం పట్టణాల్లోని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పత్తికొండలో ఇటీవల డెంగీ కేసు నమోదవడంతో అప్పటికప్పుడు వైద్యశాఖ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు, వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేపట్టారు. అలాగే తుగ్గలి, పత్తికొండలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులకు విషజ్వరాలతో బాధపడుతూ వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఆయా కేంద్రాల్లో కనీసం రోజుకు 30-40 మంది బాధితుల ఓపీ నమోదవుతుందంటున్నారు.

పేదలు ఇబ్బందులు పడుతున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించడమే కాకుండా వారి అభినందనలు అందుకుంది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలే లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహించాలి.

– గూటిపల్లి పుష్పావతి, సర్పంచ్, శభాష్‌పురం

క్యాంపుల నిర్వహణకు ఆదేశాలు లేవు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై ఇంత వరకు ఆదేశాలు లేవు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కాచి వడబోసిన నీటినే తాగాలని చెబుతున్నాం.

– ప్రవీణ్‌కుమార్, తుగ్గలి



అధ్వానంగా మారిన గూళ్యం-సిద్ధాపురం-బల్లూరు రహదారి

గుంతలమయం..

హాలహర్వి: మండలంలోని గూళ్యం,అమృతాపురం, సిద్ధాపురం,బల్లూరు గ్రామాలకు వెళ్లే రహదారి శిథిలమై అధానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో కొంత వేగంగా వెళ్తే ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని చెబుతున్నారు. యేళ్లు గడుస్తున్నా, ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా రహదారులకు మరమ్మతులు చేపట్టడం లేదని, దీంతో తమకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదున్నారు. మోకాళ్లోతు గుంతల్లో ప్రయాణం నరకాన్ని చూపుతోందని, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

చిప్పగిరి: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానికపాఠశాలలోని విద్యార్థులకు ఎస్ఐ సతీష్ కుమార్ పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా చదువుపై ధ్యాస ఉంచాలని సూచించారు.పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అందుతున్న సేవల గురించి ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా వివరిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమం రెండు రోజుల పాటు ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్ కుమార్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన గోవర్ధన్‌తో ఉపాధ్యాయులు

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ ఉన్నత పాఠశాలకు చెందిన గోవర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం గోవిందరెడ్డి తెలిపారు. ఈ నెల 24వ తేదీన నూనెపల్లెలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. నవంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గోవర్ధన్ పాల్గొంటాడని తెలిపారు. గోవర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ రంగస్వామిని శనివారం ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, టీచర్లు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

హొళగుంద: స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా ఇటీవల కర్నూలులో జరిగిన కబడ్డీ అండర్-17, అండర్-14 విభాగంలో జిల్లాస్థాయి పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నజీర్ అహమ్మద్ శనివారం తెలిపారు. కబడ్డీ అండర్-17 విభాగంలో 10వ తరగతి చదువుతున్న కె.ఇందు, అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సీ. భూమిక నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. వారిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

దారంతా మురుగు.. ఎలా వేయాలి అడుగు?



ముక్కెల్లలో రోడ్డుపై మురుగు



మారెళ్లలో మురుగులోనే రాకపోకలు



రాంపల్లిలో రోడ్డుపై పారుతున్న వృథా నీరు

తుగ్గలి : ఆ గ్రామాల్లో జనం నిత్యం మురుగులో నడక సాగించాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షం వస్తే చాలు మండలంలోని ముక్కెల్ల, రాంపల్లి, మారెళ్లలో వర్షపు నీరు వెళ్లే దారిలేక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీనికి తోడు ఇళ్ల నుంచి వృథా నీటితో రోడ్డు నిత్యం బురదమయంగా మారి రాకపోకలకు సాధ్యం కానట్టుగా మారాయి. ముక్కెల్ల, మారెళ్ల గ్రామాల్లో డ్రైనేజీలు లేవు. రాంపల్లిలో డ్రైనేజీ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటం, పలుచోట్ల నిల్వ ఉండిపోతుండటంతో కాలనీలు దుర్గంధం వెదజల్లుతుంటాయి. దోమలు వ్యాప్తి చెంది కునుకు కరువైందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భూ సమస్యలకు త్వరగా పరిష్కారం చూపండి



కమ్మరచేడులో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద్ సింగ్



మద్దిలింగదహళ్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఆదోని డివిజనల్ సర్వేయర్ వేణుసూర్య

ఆలూరు: రీ సర్వే గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రైతులు ఇచ్చిన అర్జీలకు అధికారులు వేగంగా పరిష్కారం చూపాలని ఎంపీపీ జెట్టప్పగారి రంగమ్మ రెవెన్యూ అధికారులకు సూచించారు. శనివారం గ్రామంలో జరిగిన రీ సర్వే గ్రామసభకు ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పలువురు రైతులు అర్జీలు అందజేశారు. తహసీల్దారు గోవిందుసింగ్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

హొళగుంద: గతంలో జరిగిన రీ సర్వేలో భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడంపై మద్దిలింగదహళ్లీ గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మద్దిలింగదహళ్లీ గ్రామంలో తహసీల్దార్ సతీష్, ఆదోని డివిజనల్ సర్వే ఆఫీసర్ వేణుసూర్య ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా రీ సర్వేలో అడంగల్‌లో విస్తీర్ణంలో తేడాలు, తక్కువ భూమి నమోదు కావడం, ఇతర సమస్యలు ఉన్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మ్యూటేషన్, విస్తీర్ణంలో చోటు చేసుకున్న తప్పులు, ఆన్‌లైన్ అడంగళ్లలో పేర్లు మార్పులు, ఇతర భూ సమస్యలతో కలుగుతున్న ఇబ్బందులపై 92 మంది రైతులు అర్జీలు సమర్పించారు. సర్వే డీటీ ముకుందరావు, వీఆర్‌ఓలు నాగరాజు, ప్రహ్లాద, దామోదర, సూరాంజనేయులు పాల్గొన్నారు.

ఆస్పరి: రీ సర్వేలో భూ సమస్యలుంటే పరిష్కరిస్తామని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ భీమేష్ అన్నారు. శనివారం మండలంలోని కారుమంచి గ్రామంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేపై అభ్యంతరాలుంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కారుమంచి, వెంగళాయిదొడ్డి గ్రామాల్లో 836 మంది రైతులకు సంబంధించి 5,289 వేలు ఎకరాలలో రీ సర్వే చేపట్టామన్నారు. రైతులు భూమి విస్తీర్ణం సరిగా చూపాలని కోరితే ఆరైతు సమక్షంలోనే పొలాల్లో సర్వే చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైనంత భూమి చూపాలంటే కుదరదని, రైతులు ఎంత సాగు చేస్తున్నారో అంత వరకే విస్తీర్ణం చూపుతామని చెప్పారు. వీఆర్ఓ ఎర్రిస్వామి, సర్వేయర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా చేపట్టండి

చిప్పగిరి:మండలంలో పశుగణన పక్కాగా చేపట్టాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ప్రసన్నాబాయ్ ఆదేశించారు. శనివారం మండలంలోని విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాల మిత్రలకు పశుగణన పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దగ్గర ఉన్న ప్రతి పశువును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ గణాంకాల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపకల్పన, మందుల అందజేత ఉంటుందని చెప్పారు. రైతులు, పశుపోషకులు పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. గోపాల మిత్రలు నారాయణ,నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.జనార్దన్ రెడ్డి శనివారం తెలిపారు. సాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో క్విస్, దోంతస్, ఫ్రెష్‌ఫ్రూటీ, జ్యూస్ ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎంపికైన వారు కర్నూలు జిల్లాలోనే పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. వీరికి నెలకు రూ.14,000 నుంచి రూ.18,000లు వరకు జీతం, ఇన్‌సెంటీవ్స్ ఉంటాయని తెలిపారు. ఫ్యాక్టరీ వర్క్ డెలవరీ వర్క్ పోస్టులకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, ఎదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని, 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపికైన వారు బెంగళూరులో రెండేళ్ల తర్వాత నంద్యాలలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి నెలకు రూ. 15,000లు వసతి కల్పిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





హొళగుంద నుంచి గుంటూరుకు వలస వెళ్తున్న కూలీలు

మూట, ముల్లె సర్దుకొని..

- కూలీల వలస బాట

హొళగుంద: స్థానిక బీసీ కాలనికి చెందిన దాదాపు 50 వ్యవసాయ కూలీల కుటుంబాలు శనివారం గుంటూరుకు వలస వెళ్లారు. గ్రామంలో మెట్ట భూముల్లో పంటలు ముగుస్తుండడంతో గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు కూలీలు పోతయ్య, సిద్ధలింగ, వీరేశ్, రామన్న, సిద్ధప్ప తదితరులు తెలిపారు. గ్రామంలో కల్పిస్తున్న ఉపాధి పనులు వల్ల కూలి గిట్టుబాటు కాకపోవడం, డబ్బులు సకాలంలో అందడం లేదన్నారు. గుంటూరులో మిరప కోతలు ఇతర పనులు చేసెందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అక్కడైతే కూలి ఒకే సారి చేతికందుతాయన్నారు.

యురేనియం తవ్వకాలను విరమించుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రజలకు హాని కలిగించే యురేనియం తవ్వకాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, రామంజి, భాస్కర్, మధు డిమాండ్ చేశారు. శనివారం ఆయా సంఘాల మండల ప్రతినిధి బృందం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేపట్టనుందనే సమాచారంపై కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. నాయకులు నరేష్, సురేంద్ర, శ్రీరాములు, రవితేజ, భరత్ పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి..

- రెండు బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

మద్దికెర : మద్దికెర- మొలగవెల్లి రహదారిలో శనివారం రెండు స్కూటర్లు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. మొలగవెల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్, లక్ష్మి పని నిమిత్తం మద్దికెరకు వస్తుండగా డోన్ పట్టణానికి చెందిన వారు మొలగవెల్లికి వెళ్తుండగా కుక్క అడ్డం రావడంతో అదుపు తప్పి ఢీకొన్నాయి. గాయపడిన వారిని వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. మరో ఇద్దరిని గుంతకల్లుకు తరలించారు.

నేడు హొళగుందలో రక్తదాన శిబిరం

హొళగుంద: స్థానిక తేరుబజారులో ఆదివారం ఆదోని ఏడీపీ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో గ్రామపెద్దలు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు శనివారం తెలిపారు. తలసేమియాతో పాటు వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి రక్తం కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.